# బామ్మ చెప్పిన ఓ నిజం

- సి. లక్ష్మీప్రసన్న

''మళ్ళీ మొదలుపెట్టావా! తెల్లకాయితాలు వేస్ట్ చేయొద్దంటే వినవుకదా.. ఎందుకు చెప్పు మనకి ఆ కథలూ, కాకరకాయలూ.. చదూకోరాతల్లీ.. శుభ్రంగా చదూకో.''

నేను తత్తరపడి కాయితాలు సర్దబోయి బైటపడటం ఇష్టంలేక ''అబ్బే.. కథలేం రాయటంలేదు నాన్నా.. ఎకనమిక్స్ చదువుకుంటున్నాను. అదే, నాకు లెసన్ ఎంతవరకు వచ్చిందో నాకు నేనే టెస్ట్ పెట్టుకుంటున్నాను'' అన్నాను.

నేను అబద్ధం చెప్తున్నట్టు నాన్నకు తెల్సు. ఆ విషయం నాన్నకు తెల్సని నాకు తెల్సు. నాన్న మరేం మాట్లాడక బూట్లు వేసుకొని అసహనంగా ఒక నిట్టూర్పు విడిచి బయటకు వెళ్ళిపోయారు. హమ్మయ్య.. నాన్న వెళ్ళారు. కానీ ఏం లాభం? మూడంతా చెడగొట్టి మరీ వెళ్ళారు. ఒకవారం క్రిందట కాలేజీలో జరిగిన సంఘటనను కథలాగా మలుద్దామంటే కుదరటంలేదు. నాన్న బిజినెస్ చేస్తూ ఉండటంవల్లనో ఏమో, అన్నీ వ్యాపారపరంగానే ఆలోచిస్తారు. వారం కిందట కూడా తనిలాగే కథ రాద్దామని కూర్చుంది. అదే మొదటిసారి, కథ రాద్దామన్న ఆలోచన రావటం. చాలా హుషారుగా కూర్చుంది. నాన్న బయటకు వెళ్తూ-

''ఏమిటిరాతల్లీ రాస్తున్నావ్?'' అనడిగారు. తను చాలా ఉత్సాహంగా ''కథ నాన్నా'' అంది. వెంటనే నాన్న మొహం చాలా సీరియస్‌గా మారిపోయింది. అంతే కఠినంగా ''కథలూ వద్దూ, కాకరకాయలూ వద్దు. నువ్వూ బామ్మలాగా తయారవుతున్నావా! బామ్మ ఆకాయితాలకు, కవర్లకు తగలపెట్టకుండా ఉంటే మనకింకో బిల్డింగ్ ఉండేది. చదూకో.. చదూకో.. టైంవేస్ట్ చేయకు'' అంటూ వెళ్ళిపోయారు.

నేను ఖంగుతిన్నాను. ఆ మాటల నుండి తేరుకోవడాన్కి చాలాసేపే పట్టింది. అమ్మ భోజనాన్కి రమ్మని పిలిచేవరకూ అట్లాగే కూర్చుండిపోయాను. 'అవునూ.. భోజనం టైంకదా, బామ్మేంటీ ఇంకా పిలవలేదు' అనుకున్నాను. సాధారణంగా లంచ్‌లో నేనూ, బామ్మా కబుర్లు చెప్పుకుంటూ చేస్తాము. బామ్మే తన పనంతా అయిన తర్వాత అన్నం తిందాం రమ్మని పిలుస్తుంది. కానీ ఈరోజు అమ్మ పిలిచింది. కుర్చీలోంచి లేస్తూ ''అవును.. బామ్మేదీ'' అనడిగా. ''పడుకున్నట్టుంది. పొద్దుట్నించి ఆవిడ ఏంటో మూడీగా ఉంది,'' అన్నది.

కొంపతీసి నాన్న మాటలు వినలేదుకదా అనుకుంటూ ''ఎప్పట్నించి?'' అనడిగా.

''పదింటిదాకా బానేవుంది. ఆ తర్వాతనే..'' అన్నది.


నా అనుమానం నిజమైంది. బామ్మ గదిలోకెళ్ళా. పచ్చటి మొహం కాస్తా ఎర్రగా అయింది. మాటి మాటికి కళ్ళూ, ముక్కూ తుడుచుకుంటూ కిటికీలో నుండి బయటకు చూస్తూ కూచుంది. బామ్మను చూస్తే జాలేసింది. అరవయి అయిదేళ్ళ బామ్మది చిన్నపిల్ల మనస్తత్వం. నవ్వొస్తే చిన్న పిల్లలు నిష్కల్మషంగా కేరింతలు కొట్టి నవ్వినట్టు నవ్వుతుంది. బాధ కల్గినా అంతే. కాకపోతే ఆటైంలో సాధ్యమయినంత వరకు బైటపడకుండా తనలో తనే మధనపడ్తూ ఉంటుంది. చాలా సెన్సిటివ్ మనిషి. రెండడుగులు ముందుకువేసి ''బామ్మా!'' అని పిలిచా. ఉలిక్కిపడి ఇటుచూసి గబుక్కున మొహం తిప్పుకుంది. కారడాన్కి సిద్ధంగా ఉన్న కన్నీళ్ళను నేను గమనించకపోలేదు. ''రాబామ్మా! అన్నంతిందాం'' అన్నాను.

''ఇవ్వాళ ఆకలి లేదమ్మాయ్. కాసేపాగి తింటాలే. నువ్వెళ్ళి తిను'' అన్నది. అమ్మ పిలవటంతో వంట ఇంట్లోకి వెళ్ళాను.

''నువ్వు తింటూ ఉండు. నేను పిల్చుకొస్తాలే.'' అంటూ తను వెళ్ళి ''అన్నానికి రాఅత్తయ్యా!'' అంది.

''ఆకలి లేదమ్మా. కాసేపాగి తింటాలే'' అదే సమాధానం.

''నువ్వు దేనికో బాధపడ్తున్నావత్తయ్యా! బావకు ఫోన్ చేయనా'' అంటూ ఫోన్ అందుకోపోయింది. ఒక్క ఉదుటున వచ్చి అమ్మ చేయి పట్టుకుంటూ ''వద్దు..



వద్దు.. వాడు బాగా బిజీగా ఉంటాడు. ఇంత చిన్న విషయాన్ని వాడ్ని విసిగించటం ఎందుకు? కాసేపాగి తింటానన్నాగా.'' అన్నది.

''పోనీ మామయ్యను..'' అమ్మ వాక్యం పూర్తికాకమునుపే ''వద్దు. వద్దు.. ఆయనసలే కంగారు మనిషి.'' అంటూ ఫోన్ పెట్టేసి తన గదిలోకెళ్ళిపోయింది.

ఆరోజు ఆలస్యంగా నాన్న లంచ్‌కొచ్చి ''రాజీ! అన్నంపెట్టేసెయ్. ఇప్పటికే ఆలస్యం అయింది. మళ్ళీ వెంటనే వెళ్ళాలి'' అంటూ బూట్లు విప్పుతూనే కేకపెట్టారు. నాన్నకేంటో గుట్టు తక్కువనిపిస్తుంది. చాలా విషయాలు పెద్దగా అరుస్తు చెప్తూ ఉంటారు. 'ఎందుకు అట్లా అరుస్తారు' అంటే ''దీంట్లో ఏముంది, అన్నం పెట్టు.. బాగ్ అందుకో. ఇవి కూడా రహస్యంగా మాట్లాడుకోవాలా!'' అంటారు.

అమ్మ మెదలకుండా కంచం పెట్టింది. నాన్న హడావిడిగా ఉన్నప్పుడు మాట్లాడాలంటే ధైర్యం చేసేది నేనొక్కదాన్నే మా యింట్లో. నాన్న అప్పుడే అన్నానికి కూచోపోతున్నారు. నేను దూకుడుగా వంట ఇంట్లోకెళ్ళి ''నాన్నా! బామ్మ ఇవ్వాళ అన్నం తినలేదు, తెల్సా!'' అన్నాను అరిచినట్టుగా.

''ఏం.. ఎందుకూ..'' అంటూ బామ్మగదిలోకెళ్ళి ''అమ్మా! అన్నం ఎందుకు తినలేదు?'' అని పెద్దగా అడిగారు.

దానితో బామ్మ ఉలిక్కిపడి లేచి కూచుంది. కొడుకువంక నిర్లిప్తంగా చూసిందే తప్ప ఏం మాట్లాడలేదు. అప్పుడు నేనందుకొని ''పొద్దున నేనేదో రాసుకుంటూంటే, 'బామ్మకూడా ఇలాగే డబ్బులు తగలపెట్టేది' అని అరిచావ్‌గా'' అన్నాను. 'తగలబెట్టేది' దగ్గర ఒత్తి పలుకుతూ.

నాన్న సాలోచనగా తలూపారు. బహుశః అప్పుడు గుర్తు వచ్చుంటుంది ఉదయం జరిగిన సంఘటన. పాపం బామ్మకు దుఃఖం ఆగినట్టులేదు.

''ఒరేయ్! నేనెవ్వరి డబ్బు తగలెయ్యలేదురా. మీనాన్న నా పాకెట్ మనీకింద ఇచ్చిన డబ్బులే నా అవసరాలు, కోరికలు చంపుకొని నాకు తోచిందేదో రాసుకునే దాన్ని'' అంది జీరపోయిన గొంతులో.

నాన్న బామ్మను జాలిగా చూసారు. నాన్న బామ్మ పక్కన కూచొని బామ్మ చెయ్యి నిమురుతూ చాలా అనునయంగా, ''అవునే, రాసుకున్నావ్. ఒక్క కథయినా అచ్చయిందా? పోనీ, ఒకటి రెండుసార్లు చూసి ఊర్కున్నావా? ఆ డబ్బులు తిండికి పెట్టినట్లయితే ఎంత ఆరోగ్యంగా ఉండేదానివి. అసలు నాన్న నీకందుకే కదా పాకెట్ మనీ అంటూ ఇచ్చింది. సరే, అయిందేదో అయింది. ఇప్పుడైనా సరిగ్గా తినక రోగం తెచ్చుకుంటే ఎవరు చేస్తారు చెప్పు. ఎంత మేనకోడలైనా అది నీకు సేవచేస్తుందని నేననుకోను'' అంటూ పెద్దగా నవ్వి ''దా, అన్నం తిందాం'' అని బామ్మ నడుం చుట్టూ చేయివేసి తీసుకెళ్ళి కంచం ముందు కూచోపెట్టారు. మాయింట్లో బామ్మే చిన్నపిల్ల. నాన్నే బామ్మకు క్కూడా నాన్న.



''అమ్మాయ్!'' అన్న బామ్మ పిలుపుకు ఆలోచన్ల నుండి బయటపడి ''ఏంటి బామ్మా'' అన్నాను. ''కథ రాద్దామనుకుంటున్నావ్ కదా!'' అంది.

''అవునూ!'' అన్నాను.

''అయితే నేనొక సంఘటన చెప్తాను. దాన్ని కథలాగా మలచుకోగలవా!'' అంది మెల్లగా నాదగ్గరకు కుర్చీ జరుపుకొని కూర్చుంటూ.

నాలో చాలా ఉత్సాహం కల్గింది.

''ఏంటో తొందరగా చెప్పు.. ఊ చెప్పు..'' అంటూ ముందుకు వంగాను.

బామ్మ చెప్పటం మొదలుపెట్టింది.

''అనగనగా ఒక ఊళ్ళో లక్ష్మీ అని ఒక పదహారేళ్ళ పడుచు ఉండేది. వారిది లోయర్ మిడిల్‌క్లాస్ ఫామిలి. ఆమె తండ్రి, ఒక దుకాణంలో పద్దులు రాస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. వాళ్ళెక్కువ కష్టపడకుండానే ఒక గవర్నమెంట్ చిరుద్యోగి కట్నం లేకుండా చేసుకుంటానన్నాడు.

మనిషి బాగానే ఉన్నాడు. కట్నం లేదు. తమ పిల్ల డబ్బుకి ఇబ్బంది పడకుండా రెండుపూటలా తినకల్గుతుందని సంతోషపడిపోయారు. వివాహం జరిగింది. అత్తగారింటికి వెళ్ళింది. తను, అత్తగారు, భర్త..

ఏడాది తిరిగేసరికి కూతురు. మరో ఏడాది గడిచేసరికి కొడుకు. ప్రమోషన్లకోసం భర్త

పైచదువులకు కట్టుకోవడం.. ఆర్థికంగా దాదాపుగా తమ పుట్టింటి పరిస్థితే ఎదురైంది. అనడాన్కి గవర్నమెంటు ఉద్యోగి అయినా జీతం చాలేదికాదు. అతనికి వచ్చే ఎనిమిది వందల్లో మూడొందలు అద్దెకుపోగా, ఒక వంద తన సిటీ బస్‌ఛార్జీల కింద ఉంచుకొని మిగతాది భార్యకిచ్చేవాడు.

ఆమె అందులోనే వందసార్లు లెక్కలేసుకుంటూ నెలకు ఎంతో కొంత దాస్తూ ఉండేది అదనపు ఖర్చులకుంటాయని. కానీ ఇంతవరకూ ఆ పోగైన డబ్బు ఏ అదనపు ఖర్చుకీ సరిపడేంతరాలేదు. ముఖ్యంగా తను ఒక్కసారి వాళ్ళమ్మగారింటికి వెళ్ళి వద్దామన్న కోరికను తీర్చలేకపోతున్నాయి. పెళ్ళయిన తర్వాత రెండు పురుళ్ళకు తప్ప మళ్ళీ పుట్టింటికి వెళ్ళడాన్కి కుదరలేదు. దానిక్కారణం ఏంలేదు. ఒంటిమీద సరిఅయిన బట్టల్లేక, ఛార్జీలకు డబ్బుచాలక, పుట్టింటి వారి దృష్టిలో తను మామూలు స్త్రీయా? ఒక గవర్నమెంటు ఉద్యోగి భార్యకదా! ఎంత భోగం అనుభవిస్తున్నదో అని వారి అభిప్రాయమాయె. పోనీ, భర్తనడుగుదామంటే పరిస్థితి తనకు తెలియంది కాదు. అతను మాత్రం ఎక్కడ నుండి తెస్తాడు. ఇక అప్పు చేయాల్సిందే. అది ఇద్దరికీ ఇష్టంలేదు. అందుకనే రమ్మని పుట్టింటి నుండి ఉత్తరాలు వచ్చినా ఏదో వంకతో వాయిదా వేస్తూ వచ్చింది. కానీ మనసులో వెళ్ళాలని ఉంది. ఒక్క పదిరోజులైనా అమ్మదగ్గరకు వెళ్ళి విశ్రాంతి తీసుకోవాలని ఉంది.

అనుకోకుండా ఒకరోజు అలమరలు సర్దుతూ భర్త పుస్తకాల మధ్య వంద కాయితాలు మూడు పెట్టి ఉండటం చూసింది. మనస్సు రెపరెప లాడింది. భర్త ఇక్కడెందుకు పెట్టాడు!! దేనికి పెట్టాడో, తొందరపడి తీయటం ఎందుకు? రెండ్రోజులు చూసి అతను గమనించకపోతే తీసుకోవచ్చులే అనుకుంది. మర్నాడు చూసింది. ఆమర్నాడు చూసింది.. తొందరపడలేదు. మూడో రోజు కూడా చూసింది. అవక్కడే ఉన్నాయి. మర్చిపోయుంటాడు. లేకపోతే డబ్బు విషయంలో ఇంత అజాగ్రత్తగా ఉండదు. ఆసమయంలో ఆమెకు అజ్ఞానం ఆవహించింది. అవసరం తప్పుడు పనికి ఉసికొల్పింది. ఆ డబ్బులు తీసి తన పెట్టెలో పెట్టుకున్నది. హమ్మయ్య! ఈనెల ఒక్క పదిరోజులు అమ్మదగ్గరికి వెళ్ళిరావచ్చు. ఏభై రూపాయల చీరలు నాలుగు కొనుక్కోగలదు. ఒక వంద ఖర్చులకింద చేతిలో ఉంచుకోగలదు. అని సంబరపడింది. కానీ అదెన్నో రోజులు నిలవలేదు. ఒకవారం తర్వాత...

''లక్ష్మీ! ఈ పుస్తకాల మధ్య డబ్బులు పెట్టాను. చూసావా!'' అంటూ పుస్తకాలన్నీ కెలుక్కుంటూ కేకలు పెట్టాడు రామనాధం. లక్ష్మీ గుండె గుభిల్లుమంది. తన చేతిలో డబ్బులు జారిపోతాయనే భయంతో కొంత, తీసానంటే దొంగతనం చేసానను కుంటాడని కొంత. ''చూడలేదని'' వంట ఇంట్లో నుండే కేకపెట్టింది. రామనాధంకు భార్యమీద అనుమానం రాలేదు. ఎట్లా వస్తుంది? ఇంతకు ముందెన్నడూ ఇలా జరగలేదుమరి! ''ఎక్కడ పెట్టానబ్బా'' అనుకుంటూ వెతుక్కుంటున్నాడు. మర్నాడు కూడా వెతుక్కున్నాడు అవి కన్పడవని తెలియని రామనాధం. అంతా గమనిస్తూనే ఉంది లక్ష్మి. కాని చెప్పలేకపోయింది. పాపం నుదురు కొట్టుకుంటూ వంటఇంటి దగ్గర కూలబడుతూ ''ఇంటద్దెకోసం ఉంచాను. పుస్తకాల మధ్యే పెట్టినట్టు గుర్తు. అయినా ఇంట్లో డబ్బెక్కడికి పోతుంది. ఆశ్చర్యంగా ఉందే... ఇంకెక్కడయినా పెట్టానా.. ఊహు.. అక్కడే పెట్టాను. నాకు బాగా గుర్తు, ఇప్పుడెట్లా! అప్పు చెయ్యాల్సిందే'' అంటూ గొణగటం మొదలుపెట్టాడు. భర్త ఆ పరిస్థితికి తనకు జాలివేసింది. భయం కూడా కల్గింది. తను చేసిన పనికి సిగ్గుపడింది. ఒక్కక్షణం చెప్పేద్దామనిపించింది. కానీ ఇప్పుడు నిజం బైటపెడ్తే భర్త తనను అసహ్యించుకోవచ్చు. అది తను భరించలేదు. అందుకని,

''పోనీలెండి, ఆ డబ్బులు నేనిస్తాలే. అద్దె రేపు కట్టొచ్చుకదా, ఇవ్వాళ బాంకుకు వెళ్ళి డబ్బులు తెస్తాను. దిగులు పడకండి'' అంది. భార్య పొదుపు సంగతి, బాంకిలో దాచుకొనే విషయం రామనాధానికి తెలియంది కాదు. సంభ్రమంగా, సంతోషంగా భార్యవంక చూసాడు. లక్ష్మీరాజ్యం భర్త ఆఫీసుకెళ్ళిన తర్వాత తను వెచ్చాలు తెచ్చే కిరాణా కొట్లో ఆ వంద కాయితాలు మూడూ మార్చి ఆరు ఏభై కాయితాలు తీసుకొని భర్తకిచ్చింది. తర్వాత వారి జీవితంలో అటువంటి సంఘటన జరగలేదుకో. కాలక్రమంలో రామనాధానికి కూడా ప్రమోషన్లు వచ్చినాయి. వాళ్ళు కూడా ఆస్తిపరుల జాబితాలో చేరారు'' అంటూ ముగించింది బామ్మ.

అంత శ్రద్ధగా విన్నాను. బామ్మవైపు చూస్తే ఆకథ చెప్పేటప్పుడు, అయిపోయిన తర్వాత బామ్మ ఫేసులో గిల్టీనెస్ కన్పడింది. మరి నా భ్రమేమో! తెల్చుకుంటే పోలా!! అన్పించి–


''బామ్మా! నిజం చెప్పు. ఈ కథలో రామనాధం తాతయ్యానూ, లక్ష్మీనేమో నువ్వేకదూ!'' అన్నాను.

బామ్మ కొంచెం ఇబ్బందిగా కదిలి, ''ఇష్.. పెద్దగా అరవకు.. ఈకథ మీ తాత య్యకు చూపించకేం. ఈ వయస్సులో నా పరువుపోతుంది.'' అన్నది మెల్లగా.

నేను పగలపడి నవ్వుతూనే ఉన్నాను ''ఏమిటా పిచ్చి నవ్వు'' అంటూ అమ్మ కోప్పడేదాకా. ★




## వంతెనపై ప్రేమ!



ఫ్రాన్స్‌కు చెందిన మార్సెలిన్ బెర్తెలాట్ ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు. ఆయన సోఫీ అనే అందగత్తెను గాఢంగా ప్రేమించాడు. అనేకసార్లు ఆమెకు తన ప్రేమను వ్యక్తం చెయ్యడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. మార్సెలిన్, సోఫియాల కుటుంబాల మధ్య స్నేహం ఉంది.

మార్సెలిన్‌కు సిగ్గు ఎక్కువ. ఇందువలన తన మనసులోని మాటను సోఫీకి చెప్పలేకపోయేవాడు. ఒకరోజున మార్సెలిన్ ఓ వంతెనపై నడుస్తూ వెళ్తూ ఉండగా, అటువైపు వంతెనపై నుంచి సోఫీ నడుస్తూ వచ్చి ఆయనకు ఎదురైంది. ఆ సమయంలో గాలి పెద్దగా వీస్తోంది. సోఫీ తన సమీపంలోకి వచ్చేసరికి విసురుగా వీస్తున్న గాలిని గురించి మార్సెలిన్ ఏదో అనబోయాడు సోఫీతో. అంతలో గాలి మరింత తీవ్రమై సోఫీని విసురుగా ముందుకు తోసింది. ఆ విసురుకు ఆమె సరాసరి వెళ్లి మార్సెలిన్ చేతుల్లో వాలిపోయింది!

తలవని తలంపుగా సోఫీ తన కౌగిలిలోకి వచ్చి వాలిపోవడంతో, మార్సెలిన్‌కు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. ఆ అవకాశాన్ని జారవిడవకుండా,

''సోఫీ! మనిద్దరం పెళ్లాడుదామా!'' అన్నాడు.

అది విని ఆమె ఎర్రటి గులాబీ బుగ్గలు మరింత గులాబీలు అయ్యాయి! తనకు అంగీకారమే అన్నట్లు సిగ్గుతో తల వంచుకొంది. ఓవారం తర్వాత వారిరువురూ దంపతులయ్యారు.

– కొడిమెల